దొరసాని

ఆ ఊరు పక్కమ్మటి పాడుబడ్డ దేవాలయం. దానికి కొంత దూరంలో వరుసగా మూడు గదులున్న పెంకుటిల్లు. మధ్య గదినే ముందుకు పెంకులతో పొడిగించబడ్డ వరండా వాకిట్లో ఓ వేప చెట్టు. మూడు వైపుల కాంపౌండ్ గోడ.

వరండాలో వాలుకుర్చీలో రామయ్య పంతులు, పక్కన్న భార్య సీతమ్మ. భర్త ఉత్తరాన్ని చదువుతూ వుంటే, వింటూ మధ్య మధ్యన బరువుగ నిట్టూరుస్తువుంది.

"మమ్మలిని యింతవరకు చదివించారు చాలు, మా పెళ్ళిల్ల గురించి బాధ పడకండి" ఈ వాక్యంతో, చదువుతున్న రామయ్య కళ్ళల్లోను, వింటున్న సీతమ్మ కళ్ళల్లోను నీళ్ళు తిరిగాయి.

"ఓ ప్రైవేట్ స్కూల్లో చిన్న ఉద్యోగం దొరికింది. మరో మంచి ఉద్యోగం గురించి ప్రయత్నం చేస్తువున్న"

- మీ కూతురు,

మానస.

ఉత్తరం మడిచి పక్కన పెట్టి రెండు చేతులను తలకింద పెట్టుకొని వాసాల వైపు చూస్తూ వున్నాడు.

"ఉన్న కాస్త ఆస్తి చదువులకే ఊడ్చుకుపొయె పై చదువులు వద్దంటే వినరైతిరి" అంటు బాగా అరిగిపోయిన కాలి మట్టెలను అటు యిటు తిప్పుతూ వేళ్ళకు పడ్డ గంట్లను రాస్తూ అన్నది.

"జరగాల్సినదాన్ని గూర్చి చెప్పు".

"పంతులమ్మ గారు, ఓ పంతులమ్మ గారు" అంటు దర్వాజా దాటి లోనికి వొచ్చి ఓ ఆనపకాయను మొగరానికి ఆనించి -

"మా పందిరి మీద కాసింది" రైతు కూలీ వెంకన్న.

"నీ పేరు ఎంకడు కదా ! చూడు పటేలును అడిగి కొబ్బరి కాయలు కోసుకొచ్చి యిచ్చిపో. రేపు శనివారం కదా" అంటూ కుర్చీలో వొర్గుతున్నప్పుడు ఎంతో వాత్సల్యం లాంటి కదలిక, వెంకన్న" సరేఅన్నట్టు తల వూపుతూ బయటికి నడిచాడు.

"చూశావా ఈ పంతులు గారిని ఎవరూ పస్తులు పండనివ్వరు" బుజం మీది జంధ్యాన్ని చేతులతో జరుపుకుంటు అన్నాడు.

"యిదేమన్న కొత్తా" అంటూ సొరకాయతో యింట్లోకి

నడిచింది. "రామచంద్రా" అంటు కుర్చీలో వొరిగి కాసేపు కళ్ళు మూసుకున్నాడు. అరవై ఏళ్ళ జీవితాన్ని అద్దంలో చూసుకున్నట్టు గతం కళ్ళ ముందుకొచ్చింది.

వెనకట ఏ ఊరి బ్రహ్మలు ఆ వూరిలో పంచాంగాన్ని అనుసరించి తిథి - నక్షత్రాలను చూసి, పెళ్ళిళ్ళు, తద్దినాలు, భూమి పూజలు నిర్ణయించే వాళ్ళు, రోజుకు ఒకటి వచ్చేటట్టు సర్దుబాటు చేసుకోవడం వల్ల తిండి బట్టకు లోటుండేది కాదు. యిండ్లల్లో పెండ్లిండ్లు అయితే ఏది అడిగినా తెచ్చిపెట్టేవాళ్ళు.... యిప్పుడు పట్టణాలకు పెండ్లి సామాన్లకు వెళ్ళినపుడు అక్కడే లగ్న నిర్ణయం. అన్ని లగ్గాలు ఒక్కరోజే ఫంక్షన్ హాళ్లల్లో! ఒకటడిగితే ఒకటుండదు. ఆ పూటే పెళ్ళి, ఆ పూటే విందు మరో గంటకు హాలు ఖాళీ. యిక తద్దినాల మాట దాదాపు మర్చిపోయినట్టే, పోతే భూమి పూజలు మేస్త్రీ ఒక కొబ్బరి కాయ కొట్టేస్తె చాలు. ఏం కాలమొచ్చెరా నాయనా ! యింకా ఎలాంటి కాలం రానున్నదో" ! !

* * *

రామయ్య పంతులు భోజనం ముందు కూర్చుంటూ "చూడు మన కష్టాలు గట్టెక్కినట్టే. చిన్నోనికి స్టేట్ ఎక్సైజ్ ఉద్యోగం. చిన్నదానికి కమర్షియల్ టాక్స్‌లో ఉద్యోగం. తాను ఎం.ఏ చేస్తుందట. అమ్మాయి ఉత్తరంలో రాసింది." అని ముద్దను నోట్లో పెట్టుకున్నాడు. ఉత్తరంతో పాటు పంపిన ఫోటోనే చూస్తూ కూర్చున్న తల్లి "చాల లావైంది బిడ్డ. ఆ పెద్ద

పెద్ద కళ్ళు, పొడవైన జడ, తెల్లని పలువరుస అచ్చం నేను వయస్సులో వున్నప్పుడున్నట్టే వుంది కదండి"} అంటు ఫొటోను ముద్దు పెట్టుకుంది.

* * *

ఆ తరువాత రామయ్య పంతులు యింటికి పోస్టమెన్ రాకపోకలు పెరిగాయి. ఇంట్లో టివి, బయట లూనా, డెకోలం మంచాలు, వెండి కంచాలు. ఊరంతా రామయ్య పంతులుగారి కుటుంబానికి పట్టిన అదృష్టం గురించి చెప్పుకోవడం మొదలు పెట్టారు. యిల్లు కళే మారింది. యింతకుముందు ఓ బాప నాయనా అని పిలిచిన వాళ్ళే నాలిక కర్చుకొని "పంతులు గారూ" అని పిలుస్తున్నారు.

ఉద్యోగం చేసే అమ్మాయికి పెళ్ళిచూపులొస్తే పెద్దమ్మాయికి పెళ్ళి అవ్వాలంటున్నారు. పెద్దమ్మాయి సిటీకెళ్ళి నాలుగేండ్లు కావస్తున్నది. ఒక్కసారి కూడ ఆమె యింటికి రాలేదు. ఎవ్వరిని సిటికి రమ్మనలేదు. అక్కడే కూర్చుని అన్ని నడిపిస్తువుంది.

* * *

నగరంలో -

"ఈరోజు మనం డా॥ బి.ఆర్. అంబేద్కర్‌గారి జయంతోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సభకు అధ్యక్షత వహించవలసినదిగ మన జిల్లా కలెక్టర్ బి.యన్.కె. రావు

గారిని కోరుతు, వారు అధ్యక్షస్థానాన్ని అలంకరించవలసినదిగా మనవి కరతాళధ్వనుల మధ్య కలెక్టర్‌గారు వేదిక నధిష్టించగా, వారి మెడలో పూలమాల.

"ఈనాటి ఈ సభకు ముఖ్య అతిధిగా శ్రీమతి కలెక్టర్ గారిని తమ ప్రత్యేక స్థానంపై ఆసీనులు కావలసిందిగ ప్రార్థన". శ్రీమతి కలెక్టరు గారు వేదికను అలంకరించగ ఆమెకు పుష్ప గుచ్ఛాన్ని అందించారు.

మొదట కలెక్టరు గారి తొలిపలుకులు -

"పేదవాడు పైకి రావాలంటే అంబేద్కర్‌ను అనుసరించాలి. ఆయనలాగ కష్టపడి చదవాలి. చదువు బతుకును మారుస్తుంది. ఈరోజు ఈ స్థాయిలో నేనున్నానంటే - దానికి కారణం చదువు! చదవు!! చదువుకొని పైకొచ్చినాక మీ ఊరిని మీరొచ్చిన పేదవాడలను మరిచిపోకండి" కొందరు చప్పట్లు కొట్టారు. మరికొందరు ఏదో గుసగుసలు, అది గమనించిన కలెక్టరుగారు ఉపన్యాసం ముగించి కూర్చున్నారు. "తమరు మార్చినట్లే వుంది" జనంలో ఓ గొంతు "యిప్పుడు శ్రీమతి కలెక్టర్‌గారు పేదలకు నూతన వస్త్రాలను పంచిపెడతారు" అంటూ మరో అధికారి లిస్ట్ చదువుతువున్నాడు.

బట్టలు తీసుకోవడానికి తీసుకురాబడిన కుంటి, గుడ్డి, ముదుసలి వాళ్ళంతా ఆ పట్టణానికి చెందిన వాళ్ళే, అధికారి పేర్లు చదువుతుండగ ఒక్కొక్కరే వచ్చి ఆడవాళ్ళు చీరెలను మొగవాళ్ళు దోతులను తీసుకున్నారు.

ఆ తరువాత "యిప్పుడు శ్రీమతి కలెక్టర్‌గారు తమ సందేశమిస్తారు"అని ప్రకటించాడు అధికారి.

జనంగోల ఎక్కువైంది, ఎవరూ దేనిని వినిపించుకున్నట్టు లేదు.

"మన కలెక్టర్‌గారు చదువు బ్రతుకును మార్చేస్తుంది. అన్నాడు. అది నిజం, వారి స్వాఅనుభవం కూడ, వారు అంబేద్కర్‌లాగ ఎన్నో అవమానాలకు గురి అయ్యారు. పట్టుదలతో చదివి పేదరికాన్ని వదిలించుకున్నారు. ఆయన అంబేద్కర్‌కు అక్షరాల వారసుడు. ఒక్కరిద్దరు బాగుపడగానే పేదరికం పోయిందనలేము. అంతేకాదు ఎవ్వరు కూర్చొని తినకూడదు".

"కూర్చొని తినేది ఎవరంటా" జనంలో నుండి ఓ కేక "అదే ఆలోచించవలసి వుంది అలాంటి వాళ్ళకు శ్రమించడం నేర్పవలసి వుంది అందుకోసం అందరం కృషి చేస్తేనే ఈ మార్పు జరుగుతుంది. జై భీమ్" అంటు సభకు నమస్కరిస్తూ కూర్చుంది.

ఆ తరువాత జనగణమన-

కలెక్టర్ కారు వైపు నడిచాడు వెనకాల అమ్మగారు "అలంకరించిన బ్యూటీ పార్లర్ చెప్పుకోదగ్గదే! ఆ విగ్రహానికి తగ్గట్టు ఆమె వేషధారణ" అంటు వెనకనే నడుస్తున్న మరొకడు "కాదు" అంటు గుంపులో నుండి ఓ అజ్ఞాత గొంతు

యిద్దరు కారులో కూర్చోగానే కారు కదిలి రోడ్డెక్కింది.

కథా నిలయం
694
శ్రీకాకుళం

విన్నారుకదా సూటిపోటి మాటలు" అంటూ కలెక్టర్ ముఖంలోకి చూసింది మానస.

"కొత్తేం కాదు కదా"

"వీళ్ళెన్నడు బాగుపడుతారో" మానస

"అందరు చదువుకున్ననాడు"

" ఏం చదువో ఏంటో కాని నేను కలెక్టర్ భార్యను కానట"

"విని ఊరుకున్నారే"

మౌనంగా మానస వైపు చూశాడు. అపపడు ఆమె ముఖం ఎరుపెక్కి అవమానంతో అతలాంకుతలాంగ కనిపించింది.

కాసేపు మౌనం తరువాత ఓ బరువైన శ్వాస వదిలి కర్ఛీఫ్‌తో నుదురును అద్దుకుంది.

"ఒకసారి సొంత విషయాన్ని మరొకరు నలుగురిలో నవ్వులాటగా మాట్లాడొద్దన్న విషయం వీళ్ళింకెప్పుడు తెలుసుకుంటారో"

"మనం చెప్పగా చెప్పగా"

"మరి కాలేజీల్లో ఏమి నేర్చుకుంటునట్టు"

"రొట్టె, బట్టా ఎలా సంపాదించుకోవాలనే విషయం"

వీళ్ళ సంభాషణ వింటూ డ్రైవర్ కారు నెమ్మదిగా నడుపుతున్నాడు.

"మీరు వాళ్ళనే సపోర్టు చేస్తున్నట్టు వుంది" అంటూ కలెక్టర్ కళ్ళలోకి చూసింది. అప్పుడామె కళ్ళలో నిష్టూరం కదిలికలో జాణతనం కనిపించగానే రావు గారి చూపులు

మానస మీద ఆగాయి.

కారు కలెక్టర్ బంగళాముందు ఆపి డ్రైవర్ డోరు తెరవగానే దిగి యింట్లోకి నడిచారు; పనివాళ్ళు బయటికి నడిచారు. అప్పటి వరకు లైట్స్ మాత్రమే వెలుగుతున్న యింట్లో ఫ్యాన్లు కూడ తిరగసాగాయి. గదిలో నిలువుటద్దం ముందు నిలుచోని రావుగారు కోటు బటన్ తీయగానే, వెనకనుండి వచ్చిన మానస కోటు నందుకొని హాంగర్‌కు వేసి, ముదు కొచ్చి నిలుచోని టై ముడి విప్పసాగింది. అప్పుడు రావుగారు రెప్పవాల్చకుండ అద్దంవైపే చూస్తున్నాడు. "ఏమిటలా చూస్తున్నారు" అంటూ షర్ట్ బటన్స్ విప్పుతూ. ఆఫీసు గదిలో టెలిఫోన్ మోగింది, రావుగారు ఫోన్ వైపు నడిచారు. మానస అల్మారా వైపు నడిచి నైటీని తీసుకుంది.

★ ★ ★

తిరుమలేశునికి దర్శనానికి వేలమంది క్యూలో నిలుచున్నారు. అధికారులెదురొచ్చి రామయ్య పంతులును, సీతమ్మను ప్రత్యేక మార్గం గుండా గర్భగుడిలోకి తీసుకెళ్ళి దర్శనంగావించి శేషవస్త్రాలు బహూకరించి, తీర్థ ప్రసాదాలను యిప్పించి, ఓ కాటేజిలో బస ఏర్పాటు చేశారు.

"యిది కలా నిజమా!"

"కొంచమాగండి" అంటూ భర్తను సమీపించి అతని భుజాన్ని గిల్లింది.

"వుండవే నిజమేను" అంటూ గిచ్చిన చోట చేత్తో రుద్దుకుంటు తమను దిగబెట్టి కదిలిపోయె కారువైపు చూస్తు నిలుచున్నాడు.

"ఇది ఎవరి పని అంటారు. చిన్నోడు చేయించాచ్చా, లేక చిన్నదా?

"పెద్దదాని పనే, ఎం.ఏ సంస్కృతం పాసైంది కదా యిక్కడే దేవస్థానంలో ఏదో పెద్ద వుద్యోగం దొరికిందేమో!" అంటు అప్పుడే వచ్చిన దేవస్థానం ఉద్యోగి వైపు మళ్ళి -

"నాయనా ఈ దేవస్థానం అధికారి ఎవరు" అంటు జంద్యాన్ని ఓ సారి బయటికి లాగి మళ్ళీ లోపలికి నెట్టుతూ అడిగాడు. ట్రేలోని పాల గ్లాసులను టేబుల్ మీదుంచుతు ఎందుకు అన్నట్టు చూశాడు.

"ఆఁ ఏ కులంవాడు అని" జంకుతునే అడిగాడు.

"యస్.సి"

"అలాగ" అంటు విస్తుబోతుండగ

"ఏం- ఎస్సీ వుండకూడదా"? చూపుల్లో ఓ మాదిరి కసిని కలబోస్తూ అడిగాడు.

"ఆఁ దానికేం యిప్పుడు వాళ్ళుకూడ అర్చకులుగా వున్నారు కదా"

"తమరెవరండి"

"ఎవరైతే ఏముంది, బ్రహ్మంగారుఅన్నట్టువర్ణసంకరణ జరిగి పోతూనే వుంది "నీ వెవరు నాయనా"

"నేను యస్సీనే" అంటు వెళ్ళిపోయాడు.

"ఏమండి ఆ పాలను పారపోయండి"

రెండు గ్లాసులను తీసికెళ్ళి వాష్ బేసిన్లో పోస్తూ "కృష్ణార్పణం" అన్నాడు.

"అవి అంటుబడ్డ పాలు, కృష్ణార్పణం అంటున్నారేమిటి?"

"పాపం క్షమించుగాక, సర్వార్పితం" అన్నాడు చెంపలు వేసుకుంటు.

మరునాడు ఉదయం దేవస్థాన ఉన్నత ఉద్యోగి వొచ్చి - "తమరు రామయ్య గారే కధా?"

"చిత్తం" అంటూ చేతులు జోడించి నిలుచున్నాడు.

"యిదిగో మీ ఊరి దేవాలయానికి మూడు లక్షల రూపాయలను దేవస్థానం వారు మంజూరి చేశారు. మీరు మీ ఊరెళ్ళి ఓ కమిటీని వేసి ఆ కమిటి ద్వారా ఈ గ్రాంటును ఖర్చు చేయించండి". అన్నాడు ఆ ఉద్యోగి

ఏమిటో అర్థంకాని చూపులతో వినయంగా ఆ కాగితాన్ని అందుకున్నాడు.

"పోతే మీ దంపతులెకు నూతన వస్త్రాలు", అంటు రెండు అట్టపెట్టెలను అందించాడు. ఈ సారి నోరు తెరచి కళ్ళప్పగించి చూస్తు "అమ్మా ఇదంతా ఎవరి దయ"అని అడిగాడు.

"అంతా వెంకన్న దయ, యిక మాకు శెలవు యిప్పించండి, కారు సిద్ధంగా వుంది వెళ్ళిరండి, ఉంటాం" అంటూ వెళ్ళిపోయాడు.

దంపతులు గుడివైపు చేతులు జోడించి కాసేపు నిలుచోని ఆ తరువాత కారులో కూర్చున్నారు.

కారు కదిలింది.

★ ★ ★

అది మరో ఊరు. వచ్చేపోయే బస్సులు, ఆగే చావడి అది. ఆ పక్కనే వున్న పేటకు వెళ్లడానికి నలుగురైదుగురు నిలుచున్నారు. వాళ్ళల్లో ఊరి మోతుబరి రైతు చంద్రారెడ్డి, పెద్ద గౌడ్ బాలయ్య, ఊళ్ళోని హరిజన వాడ వైపు నుండి వస్తున్న జీపును ఆపాలని చేయి ఊపాడు చంద్రారెడ్డి. అది ఆగకుండా దుమ్ము లేపుతూ వెళ్ళిపోయింది.

"ఎక్కడిదీ జీపు" రెడ్డి

"చదువు వెలుగని రాసి వుంది" గౌడ్

"అట్లనా హరిజనవాడ నుండి వస్తుంటే మన నాగయ్య కొడుకు పోతుండేమో అనుకున్న" రెడ్డి

"ఎవరు కొండయ్య, ఆయనెందుకొస్తడు, రాక ఎన్నేండ్లాయె"

"ఆయన కలెక్టరైండని ఎంత మురిసినం, ఈ ఊరును బాగుచేస్తాడని తల్లితండ్రులను సుఖపెడతాడని" రెడ్డి

"ఊరు బాగు సేయకుంటమాయె తల్లి తండ్రులకు కష్టం తప్పదాయె యింకా కూలి బతుకే! అదేపూరిల్లు, తాటాకుల పందిరి!!

అవును మొదట ఏమిలేనపుడు మేన పిల్లను చేసుకునే యిన్నే అన్నే యిస్తే ఆటిని ఖర్చుపెట్టే నౌకరి సంపాయించె.

యిప్పుడేమో దానికి చదువురాదు, నల్లగుంది మోటుముండ అంటున్నాడట.

"స్వంత చెల్లె పిల్లలతో పాటుపోతే మాట్లాడనేలేదట, ఓ సారి అన్నపోతే బర్లను యిప్పిస్తే అమ్ముకుంటివి, కోళ్ళనిప్పిస్తే చావగొడితివి. ఏం చేసి బతుకుతవు అన్నాడట, తమ్ముణ్నేమో కాలేజీలో చేర్పించి హాస్టల్లో వుండమన్నాడట" రెడ్డి.

"యింకా ఈ సంగతి తెలవదేమో. తల్లి తండ్రి వెళ్ళి కోడలిని నీ వెంట వుంచుకొని, మా కింత పంపితే పూట గడుసుద్దని అంటే అసలు మీరెందుకొచ్చింద్రని ఆ రాత్రి ఎక్కన్నో వుంచి మరునాడు పంపిచ్చిండట" అప్పటి వరకు వాళ్ళ సంభాషణ వింటున్న మరో పెద్ద మనిషి.

"నాగయ్య కొడుకు సంగతా మాట్లాడేది" దారంతో కట్టిన కళ్ళద్దాలనుండి చూస్తూ అడిగాడు.

అవునన్నటు ఇద్దరు తలాడించారు.

"పేరు గూడ మార్చుకుండట, మొన్న మామను పిలిపించి ఎ బిడ్డకు విడాకులివ్వాలి అనుకుంటున్న ఎంత కావాలి అన్నాడట. భోరున ఏడుస్తూ వద్దు తండ్రీ, సచ్చినా బతికినా నీ దగ్గరే పడివుంటది. ముద్ద పెట్టు చాలు అంటు కాళ్ళు పట్టుకున్నా కాదంటే కాదన్నాడట" పెద్ద మనిషి.

"కుటుంబమంతా కూలిచేసి పండగలు మాని పస్తులుండి సదివిస్తే ఆఫీసర్ అయినంక ఆడు చేసే పనియిదా?" రెడ్డి

"నీకు యింత పెద్ద నౌకరొచ్చింది యిగ మా పేదరికం

పోతుందనుకున్నం అని అంటె-
ఒక్కసారే ఎవ్వరి పేదరికం పోదన్నాడట"

"నా బిడ్డను కాదని మరొకరితో సంసారం చేయడం అన్యాయం, అంటే - నీ బిడ్డకు డబ్బు పంపుతునే వున్న కదా, ఏ మాత్రం గోల చేసినా అదీ బందు అవుద్ది" అని పంపించిండట.

* * *

"ఎక్కువ చదివించడం నాదే బుద్ధి తక్కువ"

"మీరేమకుంటున్నారు"

"మరి నీవు చేసిన పనేమిటి"

"మరో మార్గం కనిపించలేదు"

"అంటే"-

"మన పస్తులు పోవాలి, తమ్మునికి చెల్లెకు ఉద్యోగం రావాలి"

"ఉద్యోగమే వచ్చింది చూశావు. కాని యిపుడు దాన్ని ఎవరు చేసుకుంటరు"

"మరో ఆఫీసర్"

"ఆఫీసర్‌కు ఎంతకట్నం కావాలనుకుంటున్నవ్"

"నేను చూసుకుంటాను కదా"

"అంటె దాన్ని నీలాగే"

"కాదు తగిన వరుణ్ణి చూసి పెళ్ళి చేస్తాను"

"చేస్తావు, చేస్తావు, యస్సీ కలెక్టర్ బంధువులుగా వీళ్ళు యస్సీలని సర్టిఫికెట్ కూడ తీస్తావు"

ఈ సంభాషణ జరిగినంతసేపు వొకరి ముఖం ఒకరు చూసుకోకుండ వెనుతిరిగి నిలుచున్నారు.

"మన ఆర్థిక నేపథ్యం గురించి కూడ ఆలోచించవల్సి వుంది"

"అయితే ముందు మా చావు చేయించు"

"నాన్నా-" ఒకేసారి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కలెక్టర్ బంగళాముందు లాన్స్‌లో ఈ సంభాషణ.

"లోనికి పదండి-" అంటు అనుకోకుండ తన్నుకొచ్చిన కన్నీరును తుడుచుకుంటు తండ్రి చేతులు పట్టుకుంది. రామయ్య మౌనంగా కదలకుండా నాటిన విగ్రహంలా నిలుచున్నాడు. ముక్కు పుటలు రోషంగా కదులుతున్నాయి. నుదుటి విభూది తడిసిపోతుంది.

"కాలాన్ని బట్టి పట్టు విడుపులుండాలి నాన్న"

"నా కడుపున పుట్టి నాకు పాఠాలు నేర్పుతున్నావు" కోపంతో పెదాలు వొనుకుతున్నాయి.

"అంతమాట అనకునాన్నా. మనస్సు మార్చుకుంటే బాగుంటది అంటున్న".

"వేదపారాయణుడు, నిష్టాగరిష్ఠుడైన ఈ రామయ్య పంతులు రేపు ఛండాలునికి పుట్టే సంతానాన్ని తన ఎదమీద ఎత్తుకొని తిరగాలి, వేలుబట్టి నడక నేర్పాలి, అంతేకదా" అన్నపుడు ఆయన కళ్ళు మరి ఎరుపెక్కాయి.

"మరో జన్మ అంటూవుంటే కడజాతిలోనే జన్మిస్తాను అన్న

మహాత్ముని మాటలు మీరు చదవలేదా"

"అవన్నీ రాజకీయ ఉపన్యాసాలు. వశిష్ఠ వంశానికి చెందిన ఈ. సీతారామయ్య పంచములతో బతుకు పంచుకోవడమా!"

"మరి వశిష్ఠుడు - అరుంధతీ సంబంధం"

"అవి కట్టు కథలు"

"భారతం కట్టు కథేనా"

"సంస్కృతం చదవడం వల్ల నీకు తెలివి ఎక్కువైంది"

"మీరే అనేది కదా నాన్న, మానస నన్ను మించిన పండితురాలు అవుతుందనిని, చిన్నపుడు నా తర్కం విని"

"అదే యిప్పుడు నా కొంపకు చేటు తెచ్చింది"

"యింతకి అమ్మ బాగుందా నాన్నా"

"ఏడుస్తుంది, ఈ కులం కాని కూడుకన్న, వస్తులే మేలంటుంది ఊరుకోడై కూస్తుంటే ఎలా తలెత్తుకు తిరగాలి"

యిద్దరి మధ్య కొన్ని క్షణాలు మౌనం.

"ప్రస్తుతానికి ఊరొదిలి అమ్మ చెల్లె దగ్గర, మీరు తమ్ముని దగ్గర ఉండుండి. మిగతా విషయాలు తరువాత ఆలోచిద్దాం".

"ఆలోచించింది చాలు" అంటు వెనుదిరిగి గేటువైపు నడుస్తు జారిన భుజంమీది జరీ అంచు శాలువను సరి చేసుకున్నాడు.

"నాన్నగారు, నాన్నగారు"

తిరిగి చూడలేదు, ఆగి మాట్లాడలేదు.

లాన్స్‌లో నీళ్ళు పట్టిస్తున్న మాలి వెళ్ళి ఆపుదామని అనుకున్నాడు. ఎందుకో ఆపలేకపోయాడు. పెండ్లికాని పిల్ల పెండ్లి అయిన వాడితో తిరుగుతుంటే యిన్నాళ్ళు ఏంచేసిండో? అని తనలోతాను అనుకున్నాడు. కనపడకుండా పోయేంతవరకు తండ్రి వైపే చూస్తున్న మానస చూపులు ఎదురుగ వున్న పూల చెట్ల మీద ఆగినయి.

మొన్నటి వరకు చెట్లనిండా కనిపించిన పూలు ఈ రోజు లేవు! తనలో కలిగిన సంచలనాన్ని అణుచుకోడానికి మానస లాన్సునుండి గేటువైపు నడుస్తువుంది. గేటు దగ్గర గ్రామీణులిద్దరు కలెక్టరు గారి కోసమని నిలుచున్నట్టుంది. మానస గేటును సమీపించి మూసివున్న గేటు మీద చేతులుంచి, వాళ్ళను పరిశీలనగా చూడ సాగింది.

ఆ దుమ్ము బారిన పాదాలు ఏఏ కోరికలను గమ్యాన్ని చేర్చాలని మెసుకొస్తున్నాయో! ఆ బిక్కు బిక్కుమనే చూపులు ఏ ఆశల్ని దాచుకొస్తున్నాయో! కలెక్టర్ గారుంటే బాగుండు.

అరవై ఏండ్ల పల్లెవాసి, బుర్రమీసాలు, తలపాగ, చెవికి వేలాడుతున్న పోగు, సరిగ్గా ఆయన వయస్సులో సగం వున్న స్త్రీ మెడల పసుపుతాడు, చేతులకు మామూలు గాజులు, రంగువెలసిన నూలుచీర. ముఖాన పైసంత కుంకుమ బొట్టు, తెల్లని పలువరుస, ఎండవానల్లో రంగుమారిన ఓ మాదిరి శరీర ఛాయ.

"ఏం కావాలి"

"కలెక్టరయ్య గార్ని కలవాలి"

"దరఖాస్తు ఏమన్నా తెచ్చారా, దొర వూర్లో లేరు"

"ఎప్పుడొస్తాడు"

"రెండు రోజుల తరువాత"

"తమరు"

"యిక్కడే పని చేస్తుంటాను, చెప్పండి"

అయితే యిది అది కాదన్నమాట అనుకుంటూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ఏమీ లేదు ఒక మాట అడుగుదామని వచ్చినం. నేను ఆయన మేనమామను,

ఆమాట విన్న మానస మనస్సు కలుక్కుమంది.

బహుశ ఈవిడే ఆమె అయివుంటుంది. విన్న పోలికలు కలుస్తున్నాయి.

"లోపలికి రండి మాట్లాడుదాం"

"లోపలికి వస్తే ఏముంది - అసలోల్లు లేంది-"

"నా సమితి కనబడితే జుట్టు బట్టి కొట్టిపోదు" అంటూ కోపంతో ఊగింది.

ఈ సారి మానసకు ఒళ్ళు జల్లుమంది. ఆయన లేందే మంచిదైంది. అనుకుంది.

"ఆమె కూడ ఎమ్మెల్యే పోద్దా అమ్మా" అని అడిగాడు.

"ఉంచుకున్నదే ఊరేగేటందుకాయె!" కళ్ళలో కసి, మాట పలకడంలో ఏవగింపు కొట్టొచ్చినట్టు కనిపించాయి.

మానస మౌనంగా చూస్తూ నిలుచుంది. ఎడమ చేతికి కాల చక్రం, కుడి చేతికి బంగారు గాజులు, ఎదలో ఏముందో కనపడకుండ మెడనిండా కప్పుకున్న కొంగు!

ఆ తరువాత వాళ్ళు రోడ్డువైపు, మానస బంగ్లాలోకి నడిచారు. బి.యన్.కే రావు I.A.S. గేటు పిల్లరుకు వేలాడుతున్నాడు.

తరతరాల తర్వాత వొచ్చిన అవకాశం అందవల్సిన వాళ్లకు అందకుండా పోతుంది, చెందవల్సిన వాళ్లకు చెందకుండా పోతుంది" అనుకుంటూ, మాలి, ఎండుటాకులను ఏరుతువున్నాడు.

జూన్ 1993